క్లుప్తంగా

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

మిరుదొడ్డి(దుబ్బాక): ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులను ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక రేట్లకు విక్రయిస్తే చర్యలు తప్పవని దుబ్బాక డివిజన్ వ్యవసాయ సంచాలకుడు కె.మల్లయ్య హెచ్చరించారు. అక్బర్‌పేట–భూంపల్లి రైతు వేదిక భవన్‌లో బుధవారం ఎరువుల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుకాణాలకు సంబంధించిన లైసెన్స్‌లు, ధరల పట్టికను అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి సత్యాన్వేష్, ఏఈఓ లోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ఉలవ సాగుతో అధిక ఆదాయం



ఉలవ పంటను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనాథ్

సిద్దిపేటఅర్బన్: తక్కువ పెట్టుబడి, తక్కువ నీటితో మంచి ఆదాయం పొందడానికి ఉలవ పంట మేలైనదని అర్బన్ మండల ఏఓ శ్రీనాథ్ సూచించారు. మండలంలోని బక్రిచెప్యాల గ్రామంలో ఎల్కంటి నర్సయ్య సాగుచేస్తున్న ఉలవ పంటను బుధవారం ఆయన పరిశీలించి యాజమాన్య పద్ధతులపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్కువ నీటి లభ్యత కలిగిన రైతులు ఉలవ లాంటి స్వల్ప కాలిక పంటలను సాగు చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఏఈఓ రాజేశ్ ఉన్నారు.

గ్రీన్‌బోర్డుల అందజేత



బోర్డును ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): మండలంలోని గుడికందుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఉపాధ్యాయుడు కన్నయ్య గారి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం మాగ్నెటిక్ గ్రీన్‌బోర్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సొంత గ్రామంలోని పాఠశాలకు ఈ బోర్డులు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. హెచ్‌ఎం అంజిరెడ్డి, ఉపాధ్యాయులు నాగిరెడ్డి, హనుమారెడ్డి, కనకరాములు, వేణుమాధవ్, అనసూయ, భిక్షపతి, శివయ్య పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

దుబ్బాక: ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలోని విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు నాణ్యమైన ఆహారం అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వనితారెడ్డి సూచించారు. లచ్చపేట మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. మధ్యాహ్న భోజనం విషయంలో నిర్లక్ష్యంవహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కమిషనర్ రమేశ్ కుమార్, ఎంపీడీఓ భాస్కరశర్మ, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంఈఓ ప్రభుదాసు, కౌన్సిలర్లు శ్రీజ, బంగారయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

‘డివిజన్’ ఏర్పాటుకు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దుబ్బాక: దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు బుధవారం కలెక్టర్ మనుచౌదరిని కలిసి వినతి పత్రం అందించారు. ఆ పార్టీ జిల్లా నేత భాస్కర్ మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ కోసం ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు, దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రవికుమార్, నవీన, భాస్కర్, ఎల్లయ్య, సాజిద్, సాదిక్, ప్రశాంత్, శ్రీనివాస్, స్వామి, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

మ్యాథ్స్ టాలెంట్ టెస్టులో విద్యార్థిని ప్రతిభ



బహుమతి అందుకుంటున్న మమత

మిరుదొడ్డి(దుబ్బాక): జిల్లాస్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్టులో అక్బర్‌పేట–భూంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థిని ఎం.మమత ప్రతిభ చాటింది. కడకండ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మ్యాథ్స్ టాలెంట్ టెస్టులో జిల్లా స్థాయి ద్వితీయ బహుమతి అందుకొంది. హెచ్‌ఎం బి.రాజేందర్, గణిత ఉపాధ్యాయుడు దయాసాగర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాజేందర్, రవి శేఖర్, పీఈటీ వెంకట్‌రెడ్డి విద్యార్థినిని బుధవారం అభినందించారు.

గురువుల స్ఫూర్తి

తాము వేసిన విత్తనాలు పెరిగి వృక్షాలుగా మారి ఫలాలను అందించినప్పుడు వచ్చే ఆనందం మాటల్లో చెప్పలేనిది. మండలంలోని గుండారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు ఆ ఆనందమే పొందారు. తాము విద్యాబుద్ధులు నేర్పిన విద్యార్థులు ఉన్నతంగా ఎదిగి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినందుకు ఎంతో సంతోషించి తమ శిష్యులనే సన్మానించారు. మిగతా విద్యార్థులకు స్ఫూర్తిగా.. తోటి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారు.

- తొమ్మిది మందికి ప్రభుత్వ ఉద్యోగాలు
- శిష్యులకు ఘన సన్మానం
- ఆదర్శంగా నిలిచిన ఉపాధ్యాయులు



ఉద్యోగాలు పొందిన వారిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుండారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2008 నుంచి 2018 వరకు వరకు పనిచేసిన ఉపాధ్యాయులు బోధించిన సమయంలో చదువుకున్న విద్యార్థులలో తొమ్మిది మందికి ఉద్యోగాలు లభించాయి.

తొమ్మిది మందికి ఉద్యోగాలు

ఏఆర్ కానిస్టేబుల్‌గా జతనం రూపేశ్, నర్సింగ్ అధికారిగా గౌరి ప్రేమ్, కానిస్టేబుల్‌గా గుంటి సతీశ్, జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా కర్రావుల హర్షవర్ధన్, ఎస్‌జీటీ ఉపాధ్యాయుడుగా బొల్లి శివప్రసాద్, ఏఈఈగా గొడ్డేటి అనిల్, ఆర్మీ జీడీగా అర్కాల రాజు, బీఎస్‌ఎఫ్‌లో గొడ్డేటి చందు, అలాగే టీఎస్‌ఎస్‌పీలో బొప్పెన శ్రీకాంత్ ఉద్యోగాలు సాధించారు.

ఉపాధ్యాయుల అభినందనలు

విషయం తెలుసుకున్న అప్పటి ఉపాధ్యాయులు హన్మండ్ల భాస్కర్, రెడ్డి సుజన, పొన్నం వనిత, పాము చంద్రశేఖర్ జిల్లాల సరిహద్దులు దాటి వచ్చి అందుబాటులో ఉన్న ఉద్యోగులను సన్మానించారు. మిగతా వారికి సెల్‌ఫోన్‌ల ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. తమ విద్యార్థులు ఉన్నతంగా ఎదగడంపై ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. సన్మానం పొందిన శిష్యులు సంతోషం వ్యక్తం చేశారు.

చాలా సంతోషంగా వుంది



గుండారం పాఠశాలలో నేను ఉపాధ్యాయుడుగా పనిచేసిన కాలంలోని చదువుకున్న తొమ్మిది మందికి ప్రభుత్వ ఉద్యోగాలు రావడం ఎంతో సంతోషాన్నిచ్చింది. వారిని స్ఫూర్తిగా తీసుకొని మిగతా విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని నా ఆకాంక్ష. ఉద్యోగాలు సాధించిన వారినే కాకుండా వ్యాపార, రాజకీయరంగాల్లో ఉన్నతంగా ఎదిగిన వారినైనా ప్రతియేటా సన్మానిస్తాం.

– హన్మండ్ల భాస్కర్, ఆంగ్ల ఉపాధ్యాయుడు

మరిచిపోలేని అనుభూతి



మా ఉపాధ్యాలే మమ్మల్ని సన్మానించడం మరిచిపోలేని అనుభూతిని ఇచ్చింది. ఉద్యోగం సాధించినదానికన్నా.. ఉపాధ్యాయుల చేసిన సన్మానం చాలాగొప్పది. మిగతా విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుంది. జగదేవ్‌పూర్ మండలంలోని తీగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను.

– కర్రావుల హర్షవర్ధన్, ఉపాధ్యాయుడు

గురువులకు రుణపడి ఉంటాం



విద్య బోధించి తమని ప్రయోజకులను చేసిన గురువులకు ఎంతో రుణపడి ఉంటాం. 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు తమకు పాఠాలు చెబుతూనే జీవితంలో కూడా ఏవిధంగా ఉన్నతంగా ఎదగాలో ఉపాధ్యాయులే బోధించారు. రాజన్న సిరిసిల్లజిల్లాలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాను.

– జతనం రూపేశ్, ఏఆర్ కానిస్టేబుల్, రాజన్న సిరిసిల్లజిల్లా

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

పీసీసీ రాష్ట్ర కార్యదర్శి గిరి కొండల్‌రెడ్డి



బహుమతులు అందజేస్తున్న కొండల్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు పీసీసీ రాష్ట్ర కార్యదర్శి గిరి కొండల్‌రెడ్డి చెప్పారు. స్థానిక మోడల్ స్కూల్‌లో బుధవారం జరిగిన సీయం కప్ క్రీడలు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లేశం, కనుకచంద్రం, ఎంఈఓ వరదరాజు, ఎంపీఓ వీరరాజు పాల్గొన్నారు.

క్రీడల్లో ముందుండాలి..

దుబ్బాక/బెజ్జంకి(సిద్దిపేట): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత పిలుపునిచ్చారు. లచ్చపేట మోడల్ స్కూల్‌లో క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఎంపీడీఓ భాస్కరశర్మ, తహసీల్దార్ సంజీవ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్, ఎంఈఓ ప్రభుదాసు, కౌన్సిలర్లు బంగారయ్య, శ్రీజ, శైలజ, ఎంపీఓ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బెజ్జంకి ప్రభుత్వ పాఠశాలలో క్రీడల ప్రారంభోత్సవంలో ఎంపీడీఓ ప్రవీణ్, ఎస్‌ఐ కృష్ణారెడ్డి, ఎంఈఓ లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, దామోదర్, అంజయ్య, నర్సయ్య, పోచయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి క్రికెట్ టోర్నీ

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 14, 15వ తేదీల్లో క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ ప్రతినిధి ఐలయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విన్నర్ టీమ్‌కు రూ.3వేలు, రన్నర్ టీమ్‌కు రూ.2వేలు అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు శుక్రవారంలోపు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, మరిన్ని వివరాలకు 99485 25027 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. క్రీడా కమిటీ సభ్యులు కొండల్‌రెడ్డి, రాజు, సుధాకర్ ఉన్నారు.

కార్యాచరణ అవసరం

కొండపాక(గజ్వేల్): ఎక్కువ మార్కులు సాధించేందుకు తగిన కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఎంఈఓ బచ్చలి సత్తయ్య సూచించారు. లకుడారం హైస్కూల్‌లో విద్యాబోధన తీరును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెలలో నిర్వహించే ఎఫ్‌ఎల్‌ఎన్ మధ్యంతర పరీక్ష, ఎఫ్‌ఏ 3 పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందేలా చూసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో మైనార్టీలకు చేసింది శూన్యం

బీఆర్‌ఎస్ మైనార్టీ నేతలు



మాట్లాడుతున్న మైనార్టీ నాయకుడు మోహిజ్

సిద్దిపేటజోన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినప్పటికీ మైనార్టీలకు చేసింది ఏమీ లేదని బీఆర్‌ఎస్ పార్టీ మైనార్టీ విభాగం ప్రతినిధులు మోహిజ్ అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. మైనార్టీలకు మేనిఫెస్టోలో రూ.4వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి నేటికీ కేటాయించలేదని వాపోయారు. వక్ఫ్‌బోర్డుకు జ్యుడీషియల్ పవర్స్ ఇస్తామని చెప్పిన హామీ అమలుకు నోచుకోలేదని, షాదీ ముబారక్ ద్వారా తులం బంగారం హామీ అమలులో కూడా ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపించారు. ఎమ్మెల్యే హరీశ్‌రావును విమర్శించే నైతికహక్కు కాంగ్రెస్ నాయకులకు లేదని చెప్పారు. సమావేశంలో మైనార్టీ నాయకులు అహ్మద్, సయ్యద్, బాబ్ జానీ, కలీమ్, గోరెమియా, చాంద్, కరీం, మన్సూర్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్: ఏడాది కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చడంతో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి విమర్శించారు. బీజేపీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు ఆరు గ్యారంటీల వైఫల్యాలను ప్రశ్నిస్తూ అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం కార్నర్ మీటింగ్ నిర్వహించారు. అంతకు ముందు బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో రైతులకు రుణమాఫీ చేయకుండా మోసం చేసిందన్నారు. హుస్నాబాద్‌ను కరీంనగర్ జిల్లాలో కలుపుతామని ఇచ్చిన మాట మరిచారన్నారు. తిరుమల, కుమార్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, వేణు గోపాల్‌రావు, సతీశ్, స్వరూప, శంకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీల చదువు కుటుంబాలకు వెలుగు

హుస్నాబాద్‌రూరల్: స్త్రీల చదువులు ఆయా కుటుంబాలలో వెలుగులు నింపుతాయని సీఐ శ్రీనివాస్ అన్నారు. సీపీ ఆదేశాల మేరకు మీర్జాపూర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా అసభ్యకరంగా మాట్లాడినా.. వెంబడించినా.. 100కు ఫోన్ చేయాలన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని, ఫోక్సో చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. ఎస్‌ఐ మహేశ్, ప్రిన్సిపాల్ జయమాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్గీకరణ అమలులో నిర్లక్ష్యాన్ని సహించం

గజ్వేల్: ఎస్సీ వర్గీకరణ అమలులో నిర్లక్ష్యాన్ని సహించేదిలేదని మాదిగ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ హెచ్చరించారు. బుధవారం గజ్వేల్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఎంఎస్‌ఎఫ్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ అమలు చేసేవంతవరకు తమ పోరాటం ఆగదన్నారు. పాలిటెక్నిక్ కళాశాల నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా గౌతమ్, ఇన్‌చార్జిగా సంజయ్, ప్రధాన కార్యదర్శిగా మనోజ్‌తో పాటు ఇతర కార్యవర్గాన్ని ఎంపిక చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ పాఠాలు చెప్పిన ఎంఈఓ

కొండపాక(గజ్వేల్): సమస్యల పరిష్కారం కోసం సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. దీంతో స్థానిక కేజీబీవీ పాఠశాలలో బోధకులు లేనందున బుధవారం ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

◆ కొమురెల్లి దేవస్థానం డైరెక్టర్‌కు సన్మానం

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలోని మల్లన్న ఆలయంలో మండల కురుమ సంఘం ఆధ్వర్యంలో కొమురెల్లి దేవస్థానం పాలకమండలి డైరెక్టర్‌గా నియమితులైన తంగళ్లపల్లికి చెందిన చిగిరి కొమురయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం మండల అధ్యక్షుడు కొనే శేఖర్ మాట్లాడుతూ మల్లన్న ఆలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆలయ చైర్మన్ అశోక్, యాదఅశోక్, శంకర్, శ్రీశైలం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

సిద్దిపేటజోన్: మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తారని, ఎవ్వరూ ఆందోళన చెందవద్దని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు తెలిపారు. స్థానిక 9, 29వ వార్డుల్లో ఇందిరమ్మ కమిటీ బుధవారం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టింది. పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

◆ సర్వేను పర్యవేక్షించిన నాయకులు

నంగునూరు(సిద్దిపేట): అర్హులందరికీ ఇళ్లు మంజూరయ్యేలా కార్యకర్తలు చూడాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బుచ్చిరెడ్డి, రాజ్‌బహద్దూర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను బుధవారం ఆ పార్టీ నాయకులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో నితిన్‌కుమార్, పవన్‌కుమార్, అశోక్, శ్రీనివాస్, యాదగిరి, రామిరెడ్డి, అశోక్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

◆ మహాసభను విజయవంతం చేయండి

సిద్దిపేటకమాన్: ‘లౌకిక ప్రజాస్వామిక జీవన సంస్కృతి–సాహిత్యం’ అన్న అంశంపై 14న మహబూబ్‌నగర్‌లో జరగనున్న తొలి రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కవులు, రచయితలు కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. రంగాచారి, యాదగిరి, బాలయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ పీహెచ్‌సీ భవన నిర్మాణం పరిశీలన

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపెల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని మాజీ ఎంపీపీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గ దామోదర్ బుధవారం పరిశీలించారు. వేగవంతంగా పనులు పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, సందీప్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

తొగుట(దుబ్బాక): విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలోని వెంకట్రావుపేటలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బెజ్జరబోయిన అనిల్ మిరుదొడ్డి మండలం చెప్యాల శివారులో భూమి కౌలుకుతీసుకుని సాగుచేశాడు. కోత తీసిన పొలంలో ఎడ్లను మేతకు వదిలాడు. ఈ క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫారం వద్ద ప్రమాదవ శాత్తు వైర్ తాకడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు విలువ రూ.75వేలు ఉంటుందని, తనను ఆదుకోవాలని రైతు కోరాడు.

సస్యరక్షణతోనే పచ్చ పురుగుకు చెక్

ఏఓ మోహన్



తొగుట(దుబ్బాక): పొద్దుతిరుగుడు పంటను పరిశీలిస్తున్న ఏఓ మోహన్

తొగుట(దుబ్బాక)/సిద్దిపేటరూరల్: చలితీవ్రత పెరుగుతున్న క్రమంలో పొద్దుతిరుగుడు పంటకు ఆశించే పచ్చపురుగును సస్యరక్షణ చర్యలతోనే అరికట్టవచ్చని మండల వ్యవసాయాధికారి మోహన్ రైతులకు సూచించారు. మండలంలోని కాన్గల్ రైతు కొండల్‌రెడ్డి సాగుచేసిన పొద్దుతిరుగుడు పంటను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ తొలిదశలోనే పచ్చ పురుగును గుర్తించిన రైతులు వేపనూనె పిచికారీ చేయాలని సూచించారు. పురుగు ఉధృతి అధికంగా ఉంటే ఇమమేక్టిన్, నోవాల్యూరాన్ అనే మందును ఒక ఎకరాకు 320మిల్లీ లీటర్లు చొప్పున రెండు వందల లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలని చెప్పారు. మొక్క బొడ్డు తడిచే విధంగా మందును స్ప్రే చేసి పచ్చ పురుగును నివారించి పంటను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు కొండల్‌రెడ్డి, మహేశ్, నర్సయ్య పాల్గొన్నారు. అదే విధంగా సిద్దిపేటరూరల్ మండలంలోని పుల్లూరు, చిన్నగుండెవెల్లి, రాఘవాపూర్‌లో సాగులో ఉన్న ప్రొద్దుతిరుగుడు పంటను వ్యవసాయాధికారి నరేశ్ పరిశీలించారు. పంట ప్రస్తుతం శాఖీయ, పూత దశల్లో ఉందని, ఈ క్రమంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆయన రైతులకు సూచించారు.

కబ్జాను తొలగించి.. రోడ్డు వేయండి



మాట్లాడుతున్న గ్రామస్తులు

గజ్వేల్‌రూరల్: అదనంగా భూమిని కబ్జాచేసి ఇంటి నిర్మాణం చేపట్టడంతో తమకు రోడ్డు సౌకర్యం లేకుండా పోయిందని, దానిని తొలగించి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(సింగారం) గ్రామస్తులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ సింగారం గ్రామ అధ్యక్షుడు రాములు, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు రాజు బుధవారం విలేకరులతో మాట్లాడారు. మాజీ సర్పంచ్ కర్రె లక్ష్మి 250గజాల కంటే ఎక్కువ ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేపట్టారని, ఈ విషయమై పలుమార్లు కలెక్టర్, ఆర్డీఓకు ఫిర్యాదు చేశామని చెప్పారు. ఏడాదిగా ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ ఎలాంటి స్పందన లేదని వాపోయారు. ఇప్పటికైనా ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని తమ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు నవీన్ కుమార్, స్వామి, శివయ్య, పెంటయ్య, శ్రీను, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నటుడు మోహన్‌బాబును అరెస్టు చేయాలి



హుస్నాబాద్: నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, నాయకులు

వివిధ పార్టీల నాయకులు, జర్నలిస్టులు

హుస్నాబాద్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/దుబ్బాక: మీడియా ప్రతినిధిపై దాడికి పాల్పడిన సినీ నటుడు మోహన్‌బాబును అరెస్టు చేయాలని వివిధ పార్టీల నేతలు, జర్నలిస్టులు డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం నిరసన తెలిపారు. మీడియా ప్రతినిధిపై మోహన్‌బాబు దాడి చేయడాన్ని ఖండించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు తిరుపతి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రతినిధి అజయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, మాజీ ఎంపీపీ వెంకట్, బీఆర్‌ఎస్ నేత అన్వర్ పాష తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తున్న జర్నలిస్టులపై దాడులు సమంజసం కాదని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఖండిచారు. మోహన్ బాబును వెంటనే అరెస్టు చేయాలని దుబ్బాక ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రాజమల్లు డిమాండ్ చేశారు.

కానిస్టేబుల్ కుటుంబానికి భరోసా

ఏసీపీ పురుషోత్తంరెడ్డి



పరందాములు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఏసీపీ

చిన్నకోడూరు(సిద్దిపేట): ఇటీవల గజ్వేల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ పరందాములు, పూస వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను బుధవారం ఏసీపీ పురుషోత్తంరెడ్డి పరామర్శించి ఓదార్చారు. ఒక్కొక్కరికి రూ.1.50లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ కుటుంబాలకు డిపార్ట్‌మెంట్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. రావాల్సిన బెనిఫిట్స్ గురించి సీపీతో మాట్లాడి కృషి చేస్తానని చెప్పారు. ఆయన వెంట తొగుట సీఐ లతీఫ్, ఎస్‌ఐలు, సిబ్బంది ఉన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



లక్ష్మి (ఫైల్)

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో శతాధిక వృద్ధురాలు మృతి చెందిన ఘటన రిమ్మనగూడలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పంజాల లక్ష్మి(120) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమెకు ఇద్దరు కూతుర్లు, నలుగురు కొడుకులు ఉన్నారు.